# 30

# మేలు చేసిన తుపాను

అది సముద్ర తీరాన వున్న చిన్న బెస్త గ్రామం!

తెలతెల వారుతుండగానే జాలరులు తమ నాటు పడవలలో వలలు వేసుకుని సముద్రంలో చేపలు పట్టడానికి వెళ్తుంటారు. చీకటి పడుతుండగా తిరిగి వస్తారు. ఒక్కొక్కసారి రెండు మూడు రోజులు కూడా సముద్రం మీదనే ఉండిపోతారు.

రాము బెస్తవాళ్ళ అబ్బాయి. వయసు పన్నెండేళ్ళే..! కాని, పెద్దవాళ్ళతో సమానంగా అన్ని పనులూ చేసేవాడు. పడవకి తెడ్డు వేయడం, వలని లాగడం, చేపల్ని ఏరి ఎండ పెట్టడం... అన్నీ చక్కగా చేసేవాడు.

సముద్రం అంటేనే అతనికి ఒళ్ళు తెలియని ఆనందం! తానొక్కడూ పడవ మీద దూరంగా పోయి సరదాగా తిరిగిరావాలని కోరుకుంటుండేవాడు. కాని, ఆ చిన్నారి కోరిక తీరేదెలా?

ఆ రోజున- జాతర వుండి బెస్తవారంతా సముద్రంలోకి వెళ్లడం మానేసి తాగి తందానా లాడడం మొదలు పెట్టారు.

ఆ అదను చూసుకొని ఒక చిన్న పడవను తీసుకొని కొంతసేపు సముద్రంపై షికారు చేసి వద్దామని బయలు దేరాడు రాము.

జాగ్రత్తగా తెడ్డువేసుకుంటూ, గాలి వాలు చూసుకుంటూ నడుపు తున్నాడు.

అలల మీద పడవ ఎగిరిపడుతుంటే ఉయ్యాల వూగుతున్నట్లుంది. ఆ ఉత్సాహంలో చాలా దూరం వెళ్లిపోయాడు. అప్పటికే మధ్యాహ్నం దాటి పోయింది.

ఉన్నట్లుండి నల్లని మేఘాలు ముసురుకోసాగాయి. రివ్వున ఈదురుగాలి ప్రారంభమయింది.


— కె.ఆర్.కె.మోహన్

అది తుపాను వచ్చే సూచన..!

సముద్రం మీద తుపానులు విచిత్రంగా వస్తుంటాయి. ఉన్నట్లుండి వచ్చేసి ఓ కుదుపు కుదిపేసి, అంతటి ఆకస్మికంగానూ వెళ్లిపోతాయి.

తుపాను వస్తోందని గ్రహించి త్వర త్వరగా తీరంవైపు పడవను నడపసాగాడు రామూ. కాని, సుళ్ళు సుళ్ళుగా వస్తున్నగాలి ఆ చిన్న పడవను స్థిరంగా ఉండనీయడం లేదు. ఎగిరిగిరి పడేస్తోంది.., గిరగిరా తిప్పేస్తోంది.

అంతలో...కుండపోతగా వాన కూడా మొదలైంది. రామూ చిట్టి పడవ త్వరత్వరగా నీటితో నిండి పోసాగింది. తెడ్డుని ప్రక్కన పెట్టి దోసిటితో నీటిని తోడివేయసాగాడు,

ఆ గాలివానలో పడవ ఎటు కొట్టుకుపోతుందో కూడా తెలియడంలేదు. విపరీతమైన అలసట వచ్చేసి కళ్ళు మూసుకుపోసాగాయి.

దూరంగా మసక మసకగా ఏదో తీరం దానిమీద చెట్లతో కనిపించింది. అతి ప్రయాసతో అటువైపునకు పోసాగాడు రాము.

తుపాను శాంతించింది.

అది ఒక చిన్న ద్వీపం! తీరాన్ని చేరాక పడవని ఒడ్డుకి లాగి, చెట్ల మధ్య కనిపించకుండా దాచివేశాడు. దగ్గరలో పాక ఒకటి ఉంది. కాని, అందులో ఎవరూ లేరు. అలసట భరించలేక అక్కడ కొంచెంసేపు విశ్రాంతి తీసుకోవాలనుకొని ఆ పాకలోకి వెళ్లి నడుం వాల్చాడు. అంతే... ఒళ్ళు తెలీని నిద్రపట్టేసింది రామూకి.

కళ్ళు తెరిచేసరికి ఎదురుగుండా ఇద్దరు భయంకరాకారాలతో నిలబడి ఉన్నారు.

వారిలో ఒకడు- "ఎవరు నువ్వు..?" అని గద్దించి అడిగాడు.

రాము అందుకు సమాధానం చెప్పకుండా "నాకు చాలా ఆకలిగా ఉంది.., దాహంగా ఉంది" అన్నాడు.

రెండవవాడు రెండు రొట్టెలు, గ్లాసుతో నీళ్ళిచ్చాడు.

వాటిని తిని, మంచినీళ్ళు త్రాగి, తాను చేపలు పట్టడానికి సముద్రంలో వెళ్తుంటే, తుపాను వచ్చి ఇక్కడకు కొట్టుకువచ్చినట్లు చెప్పాడు రాము.

ఇంతలో...కొందరు కూలీలు పెట్టెలలో బంగారం బిస్కట్లు, కర్ణీలు, వాచీలు, బట్టలు వంటి అనేక దొంగ వస్తువుల్ని ఆ గుడిశలోకి తీసుకు రాసాగారు. వాళ్ళు దొంగవ్యాపారులని అర్థమయింది రాముకి.

అప్పటికి... రాత్రి తొమ్మిది గంటలు దాటి ఉంటుంది.

వారిద్దరిలో ఒకడు "వీడ్ని వదిలేద్దామా?" అని అడిగాడు.

రెండోవాడు "వద్దు... చంపి ఇక్కడే పూడ్చేద్దాం! వీడు బయటపడ్తే మనగుట్టు బయట పడ్తుంది" అన్నాడు.

మొదటి వాడు "అలాగే చేద్దాం..!" అని కత్తి తీసుకుని రాము వైపు వెళ్లసాగాడు.

రాము భయంతో పాక గుంజకు హత్తుకు పోయాడు.

మళ్ళీ ఏమి ఆలోచన వచ్చిందో... మొదటివాడు- "ఇప్పట్నించే ఎందుకు? మనం వెళ్లేముందు ఆ పని చేద్దాం. అప్పటివరకు ఈ గుంజకే కట్టేద్దాం!" అని రాము కాళ్ళు, చేతులు ఆ గుంజకి కట్టేశాడు.

తరువాత వాళ్ళు, కూలీలు ఎక్కడికో వెళ్లిపోయారు.

రాము కాళ్లూ, చేతులూ గింజుకోసాగాడు. తాడు కొంచెం వదులైంది . కష్టం మీద చేతుల కట్లు విదిలించుకొని, అక్కడ పడేసిన కత్తితో కాళ్ళ కట్లు తెంపుకున్నాడు.

అక్కడ నుంచి పరుగుపరుగున తన పడవ దగ్గరకు వెళ్లి, దానిని సముద్రంలోకి నెట్టి 'బ్రతుకు జీవుడా...' అంటూ బయటపడ్డాడు. ఆ చీకట్లో నక్షత్రాల సహాయంతో దారి చూసుకుంటూ, పడవకు వడివడిగా తెడ్డు వేయసాగాడు.

దూరాన్నుంచి ఒక మోటారు బోటు అన్నివైపులా సెర్చి లైటును వేస్తూ, ఆర్పుతూ వస్తోంది.

రాము గట్టిగా అరుస్తూ చేతులు ఊపసాగాడు.

ఆ బోటులోని వారు రాముని గమనించి, దగ్గరకు వచ్చారు. వారు రాము పడవని తమ బోటుకు తాడుతో కట్టారు. రాము ఆ బోటులోకి వెళ్లాడు. అక్కడి ఆఫీసరుతో ఆ దొంగ వ్యాపారుల సంగతి చెప్పాడు.

వెంటనే ఆ మోటారు బోటు ఆ ద్వీపం వైపు వేగంగా బయలుదేరింది .

అనుకోకుండా వచ్చిన పోలీసులను చూసి కొయ్యబారి పోయారు వాళ్ళు. పారిపోవాలని ప్రయత్నించారు కాని, ఫలితం లేకపోయింది .

అందరూ లొంగిపోయారు. సరుకంతా స్వాధీనం అయింది.

అంతటి విలువైన సమాచారం అందించి ప్రభుత్వానికి సహాయం చేసిన రాముని ఘనంగా సన్మానించారు అధికారులు. అంతేకాదు.., అతనికి తగిన వయసు రాగానే, తమ దగ్గర తగిన ఉద్యోగం కూడా ఇస్తామని హామీ ఇచ్చారు.

పసివాడు రాము తమ బెస్తపల్లెకు అంతటి కీర్తి ప్రతిష్ఠలను తెచ్చినందుకు ఎంతగానో ఆనందించారు జాలరులు.

★★★